## క్లుప్తంగా

### న్యాయ యాత్రను జయప్రదం చేయండి

కొత్తూరు: కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న న్యాయ యాత్ర సిద్ధాపూర్ నుంచి ఆదివారం ప్రారంభమవుతున్నట్లు మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీడబ్ల్యుఎస్‌సీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఇతర ముఖ్య నాయకులు కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

### కనీస సౌకర్యాలు కల్పించాలి

కొత్తూరు: మండలంలోని పలు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని, ఈ విషయంలో యాజమాన్యాలు పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తున్నాయని సీఐటీయూ జిల్లా నాయకుడు సాయిబాబా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికులు పనిచేసే చోట వారికి కనీస రక్షణ పరికరాలు సమకూర్చని కారణంగా చిన్న ప్రమాదాలు చోటు చేసుకున్నా వారు తీవ్రంగా గాయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి కార్మికులకు రక్షణ పరికరాలను సమకూర్చని పరిశ్రమల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

### జాతీయ స్థాయిలో రాణించడం అభినందనీయం

సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ రమాదేవి



మాట్లాడుతున్న మండల విద్యాధికారి వెంకటయ్య

మొయినాబాద్ రూరల్: విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణిస్తేనే ఉన్నత స్థాయికి వెళతారని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి అన్నారు. శనివారం మండల పరిధిలో తోల్‌కట సమీపంలోని గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో వివిధ క్రీడలు నిర్వహించారు. రాణించిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రమాదేవితో పాటు మండల విద్యాధికారి వెంకటయ్య మాట్లాడారు. పాఠశాల విద్యతోనే బంగారు భవిష్యత్ ఉంటుందని సూచించారు.


### కంచె ఏర్పాటు చేయండి



ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్

కొత్తూరు: ఇన్ముల్‌నర్వ గ్రామంలో ఎస్సీ కాలనీకి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెలు తక్కువ ఎత్తులో ఉండడం వల్ల ఎప్పుడు ఏం జరుగుతుందో వాహనదారులు, పాదచారులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మేకలు, పశువులు విద్యుదాఘాతానికి గురైన విషయాన్ని గుర్తు చేశారు. తక్షణమే సంబంధిత శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### ఘనంగా పల్లకీ సేవ



స్వామి వారి పల్లకీ సేవల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ఘనంగా పల్లకీ సేవ నిర్వహించారు. భక్తులు ఆట పాటలు, భజనలతో స్వామి వారిని ఊరేగించారు. ఆలయ అర్చకులు రఘుపతిరావు, రాఘవేంద్రచారి, కృష్ణ, ప్రమోద్, సునీల్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కౌన్సిలర్లు లతా శ్రీశైలంగౌడ్, ఈశ్వర్‌రాజు, శ్రీశైలంగౌడ్, రమేశ్, రఘునందన్‌రెడ్డి, శ్రీనివాస్, కిషన్ నాయక్, రాఘవేందర్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, కృష్ణాచారి, శంకర్‌గౌడ్, పద్మ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు సైన్స్ ఫెయిర్‌తో మేలు

మీర్‌పేట: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో దోహద పడతాయని డీఆర్‌డీఓ శాస్త్రవేత్త డా.రాజేందర్‌రెడ్డి పేర్కొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని మీర్‌పేట గాయత్రినగర్ ఎక్స్‌రోడ్డులోని రవీంద్రభారతి పాఠశాలలో శనివారం నిర్వహించిన 'సైన్స్ ఎక్స్‌పో'ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

# రోడ్డు పనులకు మోక్షం ఎప్పుడో?



కంకర తేలిన రోడ్డు

- ముందుకు సాగని శంకర్‌పల్లి–పత్తేపూర్
- మూడున్నర సంవత్సరాలు పూర్తయినా కొనసాగని పనులు
- పట్టించుకోని ఆర్‌అండ్‌బి అధికారులు
- ఇబ్బందుల్లో వాహనదారులు



బ్రిడ్జివద్ద శిలాఫలకం

శంకర్‌పల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్ల విస్తరణకు కోట్ల రూపాయలు ఖర్చు చేస్తుంది. ప్రతీ గ్రామానికి, మండల కేంద్రాల్లో లింక్ రోడ్లు, రోడ్ల విస్తరణ చేపట్టి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకుంటుంది. కొందరు ప్రజాప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్డు పనులు ప్రతిపాదనల ప్రకారం నిర్వహించడ లేదు. దీంతో పనులు ముందుకు సాగక జాప్యం జరుగుతుంది. శంకర్‌పల్లి ప్రధాన చౌరస్తాలోని ఇంద్రారెడ్డి విగ్రహం నుంచి పత్తేపూర్ ఫ్లైఓవర్ వరకు ఉన్న డబుల్ రోడ్డును, నాలుగు లైన్ల రోడ్డుగా మార్చేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో రూ. 3.06కోట్లను మంజూరు చేసింది. రోడ్డు పనులకు మాజీ విద్యాశాఖ మంత్రి పి సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్యతో కలిసి 2020, జూన్ 10న శంకుస్థాపన చేశారు. రోడ్డు పనులు ప్రారంభించి సుమారు మూడున్నర సంవత్సరాలు గడిచినా ఇప్పటి వరకు విస్తరణ పనులు చేపట్టడం లేదని వాహన దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తీగల వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టి పనులను వదిలేశారు. కాగా రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న అక్రమ కట్టడాలు, రేకుల షెడ్డులను, విద్యుత్ స్తంభాలు, వైర్లు తొలగించి పనులు చేపట్టాలి. గతంలో శంకర్‌పల్లి ప్రధాన చౌరస్తా నుంచి పత్తేపురం వరకు రోడ్డు సర్వే నిర్వహించి ఆర్‌అండ్‌బీ అధికారులు మార్కింగ్ సహితం చేశారు. అక్రమంగా ఉన్న కట్టడాలను, రేకులను, మండల పరిషత్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, జిల్లా పరిషత్ కార్యాలయం ఎదురుగా ఉన్న రేకుల షెడ్డులను తొలగించాలని సూచించారు. రోడ్డు సర్వే, మార్కింగ్ దశలోనే నిలిచి పోయింది. నేటికి కూడా అక్రమ షెడ్డులను తొలగించ లేదు. రోడ్డు పనులు చేపట్టడం లేదు. 2020, డిసెంబర్ వరకు ఈ పనులు పూర్తి కావాల్సి ఉండగా నేటికి పూర్తి కాకపోవడం బాధాకరమని వాహనదారులు, స్థానికులు వాపోతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో పనుల్లో జాప్యం జరుగుతుందని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొత్తగా ఏర్పాటైనా కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి రోడ్డు పనులు వేగంగా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# సర్వమత సారమొక్కటే



యేసుక్రీస్తు విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

లూర్దునగర్‌లో యేసుక్రీస్తు విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే

కొందుర్గు: అన్ని మతాల సారమొక్కటేనని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొందుర్గు మండలంలోని లూర్దునగర్‌లో శనివారం ఆయన యేసుక్రీస్తు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొందుర్గు మాజీ ఉపసర్పంచ్ రాజా రమేష్ రెడ్డి స్థలంలో గ్రామస్తుడు యారం ప్రతాప్ రెడ్డి సొంత ఖర్చుతో 30 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. దాతలను గ్రామస్తులు అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ యేసు బోధనలు అందరికీ ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ దామోదర్ రెడ్డి, వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కృష్ణా రెడ్డి, కావలి యాదయ్య, రామయ్య గౌడ్, పాల్గొన్నారు.

**న్యాయ యాత్రను విజయవంతం చేద్దాం: ఎమ్మెల్యే**

షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూర్ మండలం సిద్ధాపూర్ నుంచి ఆదివారం ప్రారంభం కానున్న న్యాయయాత్రలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జితేందర్ రెడ్డి, దామోదర్ రెడ్డి, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

# ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి



విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న అడిషనల్ డీసీపీ సాధన

రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ సాధన రేష్మి పెరుమాళ్

చేవెళ్ల: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని కృషి చేయాలని రాజేంద్రనగర్ అడిషనల్ డీసీపీ సాధన రేష్మి పెరుమాళ్ సూచించారు. మండల కేంద్రంలోని శ్రీచైతన్య జూనియర్, డిగ్రీ కళాశాలల ఫెయిర్‌వెల్ డే కార్యక్రమాన్ని శనివారం కేజీఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అడిషనల్ డీసీపీ సాధన రేష్మిపెరుమాళ్, చేవెళ్ల ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి, సీఐ లక్ష్మారెడ్డిలు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకుంటేనే తగిన గుర్తింపు వస్తుందన్నారు. చదువుతోపాటు విద్యార్థులు సమాజం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. కేటుగాళ్ల బారి నుంచి సైబర్ మోసాలను గుర్తించాలన్నారు. విద్యార్థులనే లక్ష్యంగా చేసుకొని అనేక ఆన్‌లైన్ నేరాలు జరుగుతున్నాయన్నారు. వీటి ఉచ్చులో పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆడపిల్లల రక్షణ బాధ్యతలు తామే చేసుకునే విధంగా తయారు కావాలని హితవు పలికారు. ముఖ్యంగా యువకులు ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా పాటించాలన్నారు. విద్యార్థి జీవితం అనేది ఎంతో విలువైనదని అందుకు సంమార్గంలో ప్రయాణించాలన్నారు. ఇంటర్, డిగ్రీలు విద్యార్థుల జీవితాలను మార్చేందుకు కీలకంగా ఉంటాయని, ఈ సమయంలో చదువును నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్, డైరెక్టర్లు శ్రీకాంత్, మనోహర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

వెల్స్‌పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య




రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

షాబాద్: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని వెల్స్‌పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య పేర్కొన్నారు. శనివారం మాచన్‌పల్లి గ్రామంలో వెల్స్‌పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేవెళ్ల పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల సహకారంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో మొత్తం 81 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఇందులో 33 మందిని ఆపరేసన్ కోసం, 26 మందిని అద్దాల కోసం గుర్తించిన్నట్లు తెలిపారు. రోజు ప్రత్యేకంగా బస్సుల్లో తీసుకువెళ్లి చేవెళ్ల ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్‌లు చేయనున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌వి ప్రసాద్ ఆసుపత్రి సిబ్బంది సురేందర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తే చర్యలు



వాహనదారులతో మాట్లాడుతున్న ఎస్ఐ రవీంద్రనాయక్

ట్రాఫిక్ ఎస్ఐ రవీంద్రనాయక్

షాద్‌నగర్: దుకాణాలు, హోటళ్ల ముందు రోడ్డుపై అడ్డదిడ్డంగా ఇష్టానుసారంగా వాహనాలను పార్కింగ్ చేస్తే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్ఐ రవీంద్ర నాయక్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పాత జాతీయ రహదారి గుండా ఉన్న దుకాణాలు, హోటళ్ల ముందు పార్కింగ్ చేసిన వాహనాలకు ట్రాఫిక్ పోలీసులు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ రోడ్డును ఆక్రమించి వాహనాలను పార్కింగ్‌చేయడం వల్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని అన్నారు. ఇష్టానుసారంగా ఎక్కడ పడితే అక్కడ వాహనాలను నిలపడం సరికాదన్నారు. ఇకనుంచి విస్తృతంగా పెట్రోలింగ్ నిర్వహించి జరిమానాలు విధిస్తామన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్, రోడ్డు నిబంధనలను పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# ఇంటివద్దకే మందులు..

## బీపీ, షుగర్ బాధితులకు ఓదార్పు

- మండలంలో 1,014 మందికి అందజేత



రోగులకు ఎన్‌సీడీ కిట్లు పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కేశంపేట: రక్తపోటు, మధుమేహం బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రుల ద్వారా సిబ్బందితో ఉచితంగా మందులను అందిస్తుంది. దీర్ఘకాలికంగా ఉండే వ్యాధుల నియంత్రణకు రోగులు ప్రతి దినం మందులను వాడటం అవసరం. కాబట్టి బీపీ, షుగర్‌లు ఎక్కువగా వయస్సుపైబడిన వారికే వస్తుంది. ఇలాంటి వారు గ్రామాల నుంచి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి మందులు తెచ్చుకోవడానికి తీవ్రంగా ఇబ్బందులు పడుతుంటారు. వీరి ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం వారికి నేరుగా ఇంటి వద్దకే నెల రోజులకు సరిపడ మందులను ఎన్‌సీడీ కిట్‌లో ఉంచి గ్రామాల్లోని రోగుల వద్దకే వెళ్లి అందజేస్తున్నారు. నిరక్షరాస్యులు కూడా సులువుగా గుర్తించే విధంగా ఎన్‌సీడీ కిట్లో ఉదయం, రాత్రి వేళలో మందులు వాడేలా వేర్వేరుగా సంచిని ఏర్పాటు చేశారు.

**మండలంలో ఇలా..**

మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 8 సబ్‌సెంటర్లు ఉన్నాయి. మండలంలో 49,665 జనాభా ఉండగా 1,059 అధిక రక్తపోటుతో, 466 మంది షుగర్ వ్యాధిగ్రస్తులు ఉన్నారు. గ్రామాల్లో ఇప్పటికే ఆశా కార్యకర్తలు రోగులకు ఎన్‌సీడీ కిట్లను అందజేశారు. రోగ నిర్ధారణ జరిగిన మొదటి నెల ఎన్‌సీడీ కిట్‌తో పాటు మందులను ఇస్తారు.

**రోగుల ఇంటికి వెళ్లి అందజేస్తున్నాం**



రక్తపోటు, షుగర్ కలిగిన రోగులకు ఎన్‌సీడీ కిట్లను నేరుగా గ్రామంలోని రోగి ఇంటికి వెళ్లి అందిస్తున్నాం. మందులను ఎలా వాడలో ఆరోగ్యసిబ్బంది వివరంగా చెబుతారు. కిట్‌లో రెండు బాక్స్‌లు ఉండటం వల్ల ఉదయం, రాత్రివేసుకునే మందులను వేరేవేరుగా ఉంచుతున్నారు.

– సుజాత, ఆశా కార్యకర్త, ఇప్పులపల్లి, కేశంపేట మండలం

**అర్హులందరికీ ఇస్తున్నాం**



రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్‌సీడీ కిట్లను మండలంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి నేరుగా ఇంటికి వెళ్లి సిబ్బంది అందిస్తున్నారు. బీపీ, షుగర్ లక్షణాలు కలిగిన వారు గ్రామాల్లో సిబ్బందిని సంప్రదించి రోగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి. రోగ నిర్ధారణ జరిగిన మొదటి నెల నుంచే మందులను అందిస్తున్నాం.

– డాక్టర్ నిఖిత, మండల వైద్యాధికారి, కేశంపేట మండలం

### విద్యారంగానికి ప్రాధాన్యత..

వెంకటప్ప, టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి

షాద్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం 2024–25ఆర్థిక సంవత్సరానికి శనివారం ప్రవేశ పెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు గతంకంటే పెరిగిందని టీఎస్‌యూటీఎఫ్ పక్షాన స్వాగతిస్తున్నాం. గత బడ్జెట్‌లో 6.7 శాతం ఉంటే ప్రస్తుతం 7.75 శాతం కేటాయించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యాలయాలకు శాశ్వత భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించడం హర్షణీయం. ప్రతి మండలం కేంద్రంలో అత్యాధుని వసతులతో అంతర్జాతీయ ప్రమాణాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటునకు రూ.500కోట్ల నిధులను కేటాయించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాఠశాలలను పబ్లిక్ స్కూల్స్‌గా మార్చి అభివృద్ధి చేస్తే బాగుంటుంది.

### 'ప్రజాపాలనకు నిదర్శనం'



మొయినాబాద్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రజాపాలనకు నిదర్శనంగా నిలుస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తుంది. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకు బడ్జెట్‌లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించింది. విద్యా, వైద్య రంగాలతోపాటు, వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్లకు తగిన నిధులు కేటాయించింది. ఈ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసేవిధంగా ఉంది.

– కీసరి సంజీవరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత, మొయినాబాద్

# విద్యతోనే అభివృద్ధి సాధ్యం

ఎంఈఓ శంకర్‌రాథోడ్



జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభిస్తున్న ఎంఈఓ శంకర్‌రాథోడ్

షాద్‌నగర్ రూరల్: విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, కృషి, పట్టుదల ఉంటే విజయాలు వెన్నంటే ఉంటాయని ఎంఈఓ శంకర్‌రాథోడ్ అన్నారు. పట్టణంలోని మదర్‌థెరిసా ఉన్నత పాఠశాలలో కరస్పాండెంట్ శ్యాంకుట్టి ఆధ్వర్యంలో శనివారం పాఠశాల వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ హాజరై జ్యోతిప్రజ్వలనచేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. క్రమ శిక్షణతో కూడిన విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు అందె బాబయ్య, కౌన్సిలర్ లతాశ్రీ శ్రీశైలంగౌడ్, యువసత్తా లక్ష్మణ్‌కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక ట్రాక్టర్

కేశంపేట: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కాకునూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులను చూసి గుర్తు తెలియని వ్యక్తులు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను రోడ్డుపైనే వదిలి వెళ్లారు. పోలీసులు ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ గ్రామానికి చెందిన కరికే వెంకటేశ్‌దిగా గుర్తించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

# స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



బాలకిష్టయ్య కుటుంబానికి చెక్కు అందజేస్తున్న స్నేహితులు

షాబాద్: స్నేహితుడి కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. బెడంపహాడ్ గ్రామానికి చెందిన ఉప్పరిపల్లి బాలకృష్ణయ్య ఈ నెల 3వ తేదీన అకాల మరణం చెందాడు. షాబాద్ పాఠశాలలో 1988 పదోతరగతి చదువుకున్న చిన్ననాటి స్నేహితులు బాలకృష్ణయ్య కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం తమవంతు సాయంగా రూ.40వేల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కష్ట, సుఖాల్లో పాలు పంచుకునే వాడే నిజమైన స్నేహితుడని వారన్నారు. ఈ కార్యక్రమంలో కమ్మరి శ్రీనివాస్, ముత్యంరెడ్డి, కుమ్మరి యాదగిరి, రంగయ్య, వెంకటయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.